# ఆత్మధృతి

"ఇదిగో రెండు రూపాయలు. సిటీ బస్సులో వచ్చీ. డబ్బులు మిగుల్తాయని నడిచిగాని రాగలవ్! జంక్షన్‌లో సరిగ్గా పదకొండు గంటలకు వచ్చి ఉండు" ఆజ్ఞలు జారీ చేసేడు సాంబశివం.

'అలాగే' అంటూ తలూకొట్టి వచ్చేశాడు కాశీపతి.

◆ ◆ ◆

మర్నాడు ఉదయం పది గంటలకు బయల్దేరి బస్టాపు కొచ్చేడు. చేతిలో గుడ్డ సంచీ, అందులో రెండు గావంచాలూ, ఒక పొడుం డబ్బీ; ఓ కట్ట దర్భలూ -

సిటీ బస్సులు వస్తున్నాయి, వెళ్తున్నాయి. గుంపులు గుంపులుగా జనం - ఎక్కుతున్నవారూ, దిగుతున్నవారూ, బస్సు గజాల్ని పట్టుకుని వేలాడుతున్నవారూ.

పావు గంట గడిచింది. తనెక్కాల్సిన బస్సు మాత్రం రాలేదు.

"బాబూ టైమెంతయ్యిందీ?" చేతికి వాచీ వున్న ఓ కుర్రాడిని అడిగేడు.

అతగాడు కాశీపతి వంక తేరిపార చూసి;

"ఏం? ఆఫీసుకు గాని వెళ్ళాలేమిటి పంతులుగారు" అంటూ నవ్వి, "పదింపావు" అన్నాడు.

ఆ సమాధానంలోని వ్యంగ్యానికి కాశీపతి నొచ్చుకోలేదు. అటువంటి వెటకారాలకూ వేళాకోళాలకూ జీవితంలో బాగానే అలవాటు పడిపోయాడతను.

బస్సు రావాలేగాని వస్తే ఎంతసేపో పట్టదు. ఇక్కడ నిల్చునే కన్నా అలా నాలుగడుగులు వేస్తే కాలు సాగినట్టూ ఉంటుంది. కాలం జరిగినట్టూ ఉంటుంది. పక్క

బస్టాపు నుండయితే ఛార్జీ అర్ధ రూపాయి తగ్గుతుంది కూడా - అలా అనుకుని నెమ్మదిగా అడుగు ముందుకు వేశాడు.

అనుకున్నట్లుగానే అక్కడకు చేరేసరికి తనెక్కాల్సిన బస్సు రానే వచ్చింది. నిండుగానే వచ్చింది.

"ముసలాణ్ణి నాయనా. నన్ను కాస్త ఎక్కనివ్వండి" అని బతిమాలుకుంటే జాలిపడ్డ జనం చోటిచ్చేరు.

బస్సు కదిలినా; జనం మధ్య నిల్చోడం వల్ల ఊపిరాడ్డం లేదు కాశీపతికి. వళ్ళంతా చెమటలు పట్టేసాయి. ఎడంకాలి పాదం ఎవరో తొక్కేశారు. అయినా ఓర్చుకొని నిలబడ్డాడు.

ఇరవై నిముషాల్లో ఇసకతోట జంక్షన్‌లో దిగేడు. దిగి రెండడుగులు వేసి, ఎడంకాలి చెప్పు రానని మొరాయిస్తుంటే దాని వంక చూసేడు. బొటనవేలి పట్టీ తెగిపోయి ఉంది. కరువులో అధికమాసంలా యిదొకటా అనుకుంటూ జంక్షన్‌లో కిల్లీ బడ్డీ పక్కనున్న ఖాళీ అరుగు మీద చతికిలపడ్డాడు.

మరి కాస్సేపట్లోనే గంట పదకొండు కొట్టింది. అప్పుడే ఎండ ఫెళ్లుమంటోంది. ఉదయం ఏమీ తిని రాకపోవడం వల్ల నిస్త్రాణగా దాహంగా అనిపించింది కాశీపతికి. మంచి నీళ్ళు తాగితే బాగుండుననిపించింది. పూర్వపు రోజుల్లో అయితే వీధి కొళాయిలుండేవి. అందులోంచి నీళ్లూ వచ్చేవి.

కిల్లీ కొట్లో కూల్‌డ్రింక్‌లూ, సోడాలూ జోరుగానే అమ్మకమవుతున్నాయి.

'పోనీ ఓ సోడా తాగితేనో' అనుకున్నాడు. ఒకప్పుడు సోడా అర్ధణా ఉండేది. సోడా కాయ నిండా గేసు ఉండేది. ఇప్పుడది అర్ధరూపాయి అయిపోయినా గేసుండదు పైగా ఉప్పు నీళ్ళు. దానికోసం అర్ధరూపాయి వెచ్చించే కన్నా తెగిన చెప్పు కుట్టించుకోవడం ముఖ్యం అనుకున్నాడు.

ఈలోగా అతను కూర్చున్న అరుగు తాలూకా ఇంటి తలుపులు తెరుచుకుని ఓ నలభై ఏళ్ళామె వీధిలోకి వచ్చి ఎవరికోసమో తొంగి చూసి, వెళ్ళి తలుపేసుకోబోయింది.

"తల్లీ కాసిన్ని మంచినీళ్లివ్వవూ" అడిగేడు కాశీపతి.

ఆవిడ లోపలికి వెళ్ళి ఫ్రిజ్‌లోనివి కాబోలు చల్లని మంచినీళ్ళు స్టీలు గ్లాసులో పోసి యిచ్చింది. పళ్లు కాస్త జుమ్మన్నా లక్ష్యపెట్టకుండా తాగేశాడు. ప్రాణం కాస్త కుదుటపడ్డట్టనిపించింది.

"సౌభాగ్యవతిగా వర్ధిల్లు తల్లీ" అంటూ ఆమెను దీవించేడు.

ఆమె లోపలికి వెళ్ళి తలుపేసుకుంది.

పదకొండు దాటి పావుగంట పైనే అయింది. సాంబశివం మాత్రం రాలేదు.

చేతిలో మోటారు బండి ఉంది. ఎంతలో రావాలీ అని సరిపెట్టుకుని కూర్చున్నాడు.

కాశీపతి కళ్ళకి ఎదురుగా రావిచెట్టు కింద కూర్చున్న చెప్పులు కుట్టే అతను కన్పించేడు చెప్పు కుట్టడానికి ఎంత అడుగుతాడో? ఖాళీగానే ఉన్నాడు మరి. తను

ఎంతిచ్చినా పుచ్చుకోవచ్చునేమో! సాంబశివం వచ్చేలోగా యీ పనైనా అవుతుంది అనుకుంటూ లేచేడు.

"రూపాయి అవుతుంది" అన్నాడు చెప్పులు కుట్టే అతడు కాశీపతిని చూసి.

"నా దగ్గర అర్థ రూపాయే ఉంది నాయనా. ఎలాగో కుట్టి పెట్టు" అన్నాడు బతిమాలే ధోరణిలో. నిజానికి అతని దగ్గర మరో అర్థ రూపాయి కూడా ఉంది. అతగాడు చెప్పు కుడుతున్నంత సేపు కాశీపతి దృష్టి జంక్షన్ వైపే నిలిపి ఉంచేడు. సాంబశివం ఏ క్షణానైన్నా రావొచ్చు. వచ్చేస్తే తనక్కడ లేదని తిట్లకు లంఘించుకుంటాడు.

చెప్పు కుట్టడం పూర్తయింది. సాంబశివం మాత్రం రాలేదు. కొంపదీసి అతనుండమన్నది యీ జంక్షన్‌లో కాదా? అన్న అనుమానం కూడా వచ్చింది కాశీపతికి.

తను జాగ్రత్తగానే విన్నట్టు గుర్తు. ఆర్నెల్ల క్రితం యీ ప్రాంతంలోనే ఒకరింటికి మాసికానికని తీసుకువచ్చేడు సాంబశివం. ఆ రోజు కొసిరి కొసిరి గారెల్నీ పరవాణ్ణాన్నీ వడ్డించిందా ఇల్లాలు! దక్షిణ కూడా బాగానే ముట్టింది. సాంబశివం చెప్పినప్పుడు వాళ్ళిల్లే గుర్తుకొచ్చింది.

ఎండెక్కుతున్న కొద్దీ కాశీపతి కడుపులో పేగులు కరకరలాడసాగేయి. క్రితం రోజు పొద్దుగూకే వేళ తిన్న నాలుగు పచ్చడి మెతుకులూ ఎప్పుడో అరిగిపోయాయి. ఏమీ తినకుండా అబ్దీకం భోజనానికి వెళ్ళాలనే నియమాన్ని తను యిన్నేళ్ళుగా పాటిస్తున్నాడు.

"మీకైతే కుదిరిపోయింది. మరి మా సంగతేమిటి?" అంది అన్నపూర్ణ తను వస్తూంటే.

"ఈ పూటకెలాగో నాలుగు గింజలు ఎక్కడైనా అప్పు పుట్టించు. నేను వస్తూ తెస్తానుగా" అని వచ్చేశాడు.

ఇల్లాలు మారు మాట్లాడలేదు.

అప్పు తెచ్చిందో లేదో!

ఎక్కడిదో... పన్నెండు గంటల సైరన్ కూడా వినిపించింది.

ఆకల్నీ, కోపాన్నీ అణుచుకున్నాడు కాశీపతి. బతుకు యిలా గడపాల్సి వస్తున్నందుకు తన జీవితం మీద తనకే అసహ్యమేసింది.

కొడుకైనా ఉద్ధరిస్తాడా అంటే ఆ ఆశ కూడా కనుచూపు మేరలో కానరావటం లేదు.

నరసింహం పదో తరగతి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యేడు. తన కుటుంబంలో ఆ మాత్రం అలా చదివిన వాళ్ళు ఇంతవరకు లేరు. నరసింహం తెలివైన వాడు, చదువు మీద శ్రద్ధాసక్తులు వున్నవాడు. కానీ ఏం లాభం? ఇంటర్లో వచ్చిన డెబ్బయ్ శాతం మార్కులూ డిగ్రీలో సీటును సంపాదించలేకపోయాయి. ఏవేవో రిజర్వేషన్లట. కుల ప్రాతిపదిక మీదా, యితరత్రానూ యిచ్చేవి! నరసింహం కంటే మార్కులు బాగా తక్కువొచ్చిన వారికి కూడా డిగ్రీలో సీట్లొచ్చాయి. తను డొనేషన్ కట్టలేకపోయాడు. అగ్ర

కులంలో పుట్టినా రెండు పూట్లా తిండి తినటానికే పరిస్థితులు అంతంత మాత్రంగా వుంటే యిక డొనేషన్లు కట్టి ఎక్కడ చదివించగలడు? అందుక్కావలసిన అప్పయినా ఎవరు మాత్రం ఏం చూసి యిస్తారు?

నరసింహానికి ఇంటి పరిస్థితులు తెలుసు అయినా వాడికి తన మీద కోపం.

నిజమే! కోపం ఉండొచ్చు. తనొట్టి పనికి మాలినవాడు. వెధవాయి. వృత్తిని నమ్ముకున్నందుకు నాలుగు పనికొచ్చే మంత్రాలైనా నేర్చుకోని బడుద్ధాయి.

టైం పన్నెండున్నర దాటింది. సాంబశివం మాత్రం అయిపు లేడు. తన పేదరికం మీదా, అసమర్థత మీదా సాంబశివానికి జాలి, ఎగతాళి కూడా! అతగాడిని నమ్ముకోవడం వల్లనే నాలుగు రోజులకైనా భోక్తగా మంచి భోజనం; నాలుగు డబ్బులూ కళ్ళ జూస్తున్నాడు.

మొదట్లో సాంబశివం తండ్రి విశ్వనాథం తనను చేరదీసేడు. అతను పండితుడు. మనిషిని చూస్తే బ్రాహ్మణత్వం ఉట్టిపడుతూ ఉండేది. ఎవరినీ నొప్పించకుండా కుల వృత్తిని గౌరవంగా కాపాడుకుంటూ కాస్తో కూస్తో సంపాదించి వెళ్ళిపోయేడు.

సాంబశివం తీరే వేరు. అంతా వ్యాపార దృష్టి. 'ఇంచుమించు అన్ని కులాల వారూ తమ తమ కుల వృత్తులను వ్యాపార సరళిలోనే చేసుకుంటూంటే దానాల కోసం, దక్షిణల కోసం మనం దేబిరించడం తెలివి తక్కువతనం' అంటాడు.

న్యాయంగా వారిచ్చే దక్షిణల కన్నా తన లాంటి వారికి ఎక్కువ యిప్పించి అందులో కొంత కమీషన్‌గా తీసుకుంటాడు.

అంచేతే తండ్రి సైకిల్ వాడితే, ఇతగాడు మోపెడ్ కొన్నాడు. తండ్రి పెచ్చులూడి పోయే పెంకుటింట్లో కాలక్షేపం చేస్తే, ఇతడు దాన్ని బాగుచేసి డాబా వేయించేడు.

ఒంటిగంట కూడా కొట్టింది. కాశీపతికి కడుపులో ఆకలి సుళ్ళు తిరుగుతోంది. నిస్త్రాణ వచ్చి కళ్ళు కూడా తిరుగుతున్నట్టు అనిపించింది.

సాంబశివం ఎందుకిలా చేశాడూ? అనుకున్నాడు. ఇక వేచి ఉండడంలో అర్థం లేదనుకుని తిరిగి వెళ్ళిపోవడానికే నిశ్చయించుకున్నాడు. అయితే చేతిలో అర్థ రూపాయే ఉంది. లేచి నెమ్మదిగా నడక సాగించేడు. రోడ్డు మీద జనం పల్చగా వున్నారు. ఇంతలో ఏదో బస్సు తను వెళ్ళే వైపే ఖాళీగా వెళ్తూ ఆగింది. అర్థ రూపాయి తననెంత వరకూ చేరుస్తుందో తెలీదు - నడిచే ఓపికా లేదు. 'అరవై ఏళ్ళు దాటిన తన లాంటి వారికి ప్రభుత్వం బస్సు టిక్కెట్లలో కన్సెషన్ యిస్తే బాగుండును' అనుకున్నాడు. ఏమైతే అయిందని చటుక్కున బస్సు ఎక్కేశాడు.

కిల్లీ కోసమో, మరి దేనికోసమో దిగిన కండక్టరు తిరిగొచ్చి, "పంతులుగారూ బస్సు రూట్లో వెళ్ళదు. స్టాండుకి వెళ్తోంది. దిగండి" అన్నాడు మర్యాదగానే.

"నేనూ స్టాండులోనే దిగిపోతాను. కాదనకు బాబ్బాబూ. ముసలి ముండావాణ్ణి" అన్నాడు బతిమాలే ధోరణిలో.

కండక్టర్ ఏం మాట్లాడలేదు. బస్టాండులో బస్సు ఆగగానే డ్రైవరూ, కండక్టరూ

దిగి వెళ్ళిపోయారు. తనను టిక్కెట్టు అడగనందుకు అతగాడిని మనసులోనే దీవించి బస్సు దిగిపోయాడు కాశీపతి.

ఖాళీ కడుపుతోనూ, ఉత్త చేతులతోనూ యింటికి వెళ్ళబుద్ధి కాలేదతనికి.

కాళ్లు సాంబశివం యింటివైపు మళ్ళేయి.

కాశీపతి వెళ్ళేసరికి సాంబశివం యింకా యింటికి చేరలేదు.

"అదేమిటి. మీరు వెళ్ళలేదా?" అంటూ అడిగింది అతని భార్య.

లేదన్నట్టు తలూపి అరుగు మీదే చతికిలపడ్డాడు.

మరో పది నిముషాల్లోనే సాంబశివం వచ్చేడు.

"కొంత మందికి జరుగుబాటు యిందుకే ఉండదు" అంటూ పరోక్షంగా తిట్లకు లంఘించుకున్నాడు. చివరికి, "నిన్ను పెద వాల్తేరు జంక్షన్‌లో ఉండమంటే ఎక్కడకు దయచేశావ్" అనడిగాడు.

తప్పెక్కడ జరిగిందో అర్థమైంది కాశీపతికి. వెంటనే తన తప్పును ఒప్పేసుకున్నాడు. సాంబశివం మరేం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయాడు. కాస్సేపాగి వచ్చి చూస్తే కాశీపతి అరుగు మీద అలాగే కూర్చుని ఉన్నాడు. అతని స్థితికి జాలేసింది సాంబశివానికి.

"నీ కోసం చూసి చూసి గంధపు చెక్కను పెట్టి కార్యం జరిపించేశాను. ఇలా చేస్తే ఎలా చెప్పు?" అంటూ ఓ గ్లాసుడు మజ్జిగ, రెండు అరటి పళ్ళు తెచ్చి యిచ్చాడు.

కాస్త ఓపిక వచ్చాక కూడా కాశీపతి ఏం మాట్లాడలేదు. ఏం మాట్లాడినా సాంబశివానికి కోపం వచ్చేస్తుంది. పెద్దంతరం చిన్నంతరమైనా చూడకుండా అమ్మాఅలీ చేసి బూతులు తిడతాడు. ఇక ముందు ఏ కార్యానికీ తనను పిలవడు.

"సర్లే. అయిందేదో అయిపోయింది. రేపాదివారం దేవగుప్తావు వారింట్లో అబ్దీకముంది. లక్షాధికార్లు. భోజనమూ, దక్షిణా రెండూ బావుంటాయి. శనివారం సాయంకాలం వస్తే ఎడ్రసూ, బస్సు డబ్బులూ యిస్తాను. మర్చిపోకు" అన్నాడు సాంబశివం.

సరేనన్నట్టు తలూపి లేచి సందేహిస్తూ అక్కడే నిలబడ్డాడు కాశీపతి.

"ఇంకా ఏవిటి? వెళ్ళు" అన్నాడు సాంబశివం.

"ఇంటికి సామాను తీసుకెళ్ళాలి. ఓ యిరవై యిస్తే ఆదివారం యిచ్చేస్తాను" ననిగేడు కాశీపతి.

"అడ్వాన్సన్నమాట" అంటూ లోపలికెళ్ళి ఓ పదిహేను రూపాయలు తెచ్చి అతని చేతిలో పెట్టేడు.

◆ ◆ ◆

ఆదివారం ఉదయం పదకొండు గంటలకే సాంబశివం యిచ్చిన అడ్రస్ ప్రకారం డోర్ నెంబర్ కనుక్కొని అక్కడే కూర్చున్నాడు కాశీపతి. పన్నెండు గంటల ప్రాంతంలో సాంబశివం, అతని మేనల్లుడూ మోపెడ్ మీద వచ్చారు.

ఆబ్దీకం తంతు అంతా చకచకా జరిపించేశాడు సాంబశివం. భోజనాలు

వడ్డించేరు. పనస పొట్టు కూరతో నాలుగు కూరలూ, నాలుగు పచ్చళ్ళూ, పిండివంటలూ యధావిధిగానే చేశారు. అరిటాకులో మెతుక్కూడా మిగల్చకుండా సంతృప్తిగా భోంచేశాడు కాశీపతి. కాఫీ టిఫిన్లు చేసి వచ్చారో ఏమో సాంబశివం, అతని మేనల్లుడూ భోజనం ఏదో అయిందనిపించి లేచారు.

ఆశీర్వచనం వేళ అయింది. పళ్లెంలో తాంబూలాన్ని సర్ది తీసుకొచ్చి సాంబశివానికి వంద రూపాయలూ, భోక్తలిద్దరికీ చెరో యాభై రూపాయలూ తాంబూలంలో పెట్టి యిచ్చి, కాళ్ళకు దండం పెట్టేడు కర్త కామేశ్వరరావు. అతగాడు బాగా చదువుకున్నవాడూ, పెద్ద హోదా వున్న ఉద్యోగం చేస్తున్నవాడూ. అతడిని ఆయురారోగ్యాలతో చల్లగా వర్ధిల్లమని మనస్ఫూర్తిగానే దీవించాడు కాశీపతి.

సాంబశివం మాత్రం నోట్లు లెక్కబెట్టుకుని అభ్యంతరం లేవదీసేడు. మధ్యలో కొరదాపడ్డ రెండు మాసికాల పని కూడా యదావిధిగా జరిపించినందుకు వాటి తాలూకు దక్షిణలు కూడా కలిపి తనకు మరో వందా, భోక్తలకు చెరో పాతికా యివ్వాలన్నాడు.

కామేశ్వరరావు ఒక్క క్షణం సాంబశివం వంక చూసి, మారు మాట్లాడకుండా అతను చెప్పినట్టుగానే యిచ్చేశాడు. సాంబశివం ముఖం అప్పుడు వికసించింది. సంతృప్తిగా దీవించాడు. అనుకోకుండా ముట్టిన సొమ్ముకు కాశీపతి కూడా సంతోషించాడు. నోట్లు మడత పెట్టి జుబ్బా ప్రక్క జేబులో జాగ్రత్తగా పెట్టుకున్నాడు.

"వచ్చే నెల పదో తేదీ దశమి తిథిన మళ్ళీ మాసికం పడింది. రెండు రోజుల ముందు నాకు కబురు చేస్తే చాలు" అన్నాడు సాంబశివం.

"ఆ అవసరం రాదేమోలెండి" అన్నాడు కామేశ్వరరావు నెమ్మదిగా.

అతని వంక అర్థం కానట్టు చూశాడు సాంబశివం.

"చూడండి సాంబశివంగారూ! పాత నమ్మకాల్నీ, సంప్రదాయాల్నీ వదులుకోలేక చేస్తున్న కర్మ ఇది. ఉద్యోగరీత్యా మరో రాష్ట్రంలో ఉన్నా జరిపిస్తూనే వచ్చాం. ఇది కూడా కమర్షియల్‌గా తయారవడం నాకు నచ్చలేదు. ఈ రోజు కార్యక్రమం యధావిధిగా జరగలేదని నేననుకుంటున్నాను. మీరు జరిపించాల్సిన తంతులో కొన్ని మరిచిపోయేరో, అక్కర్లేదనే అనుకున్నారోగానీ కొన్ని జరిపించలేదు. అది మీకూ తెలిసే ఉండాలి. అవకాశం లేక మేం వదిలేసిన మాసికాలకు కూడా మీరు దక్షిణలను రాబట్టుకోవడం కూడా నాకు నచ్చలేదు. ఇటువంటి పితృ కార్యాలను జరిపించేటప్పుడు మీ వంటి వారెంత సంతృప్తి పడాలో కర్తలమైన మేమూ అంతే సంతృప్తి పడాలిగదా! ఇంతకంటే స్వర్గస్థులైన మా తండ్రిగారి పేరు మీద ఆ రోజు కొందరు అన్నార్తులకు యింత అన్నం పెడితే మంచిదనిపిస్తోంది" అన్నాడు కామేశ్వరరావు.

సాంబశివం ముఖంలో నెత్తురు చుక్క లేదు. అయినా సమర్ధించుకుందికేవేవో నాలుగు మాటలు మాట్లాడేడు.

'మంచి శాస్తే జరిగింది. మనిషికి మరీ అంత స్పీడూ, దాహమూ ఉండకూడదు'. అని మనసులోనే అనుకుంటూ బయటకొచ్చి చెట్టు కింద నిలబడ్డాడు కాశీపతి.

సాంబశివం అక్కడికొచ్చాక తను బాకీ వున్న పదిహేను రూపాయలు; ొమూలుగా యిచ్చే సాంబశివం కమీషనూ తీసి అతని కందించేడు.

"ఏవోయ్! నీకూ తెలివితేటలొచ్చేస్తున్నాయే! ఏనాడన్నా భోక్తగా వెళ్ళి ముప్ఫయ్ న్నా ఎక్కువ కళ్ళ చూశావా? నేను బేరమాడి రాబట్టినది కూడా నాదే. ఇలాతే" అంటూ ంయ్ మన్నాడు.

మారు మాట్లాడకుండా అతనికా సొమ్ము అందించి అతగాడు మోపెడ్ స్టార్ట్ ఁశాక నెమ్మదిగా బస్టాపు వైపు నడిచాడు.

◆ ❖ ◆

కాశీపతికి ఇల్లు జేరేసరికి రెండున్నర దాటింది. దారి పొడవునా ఆలోచనలే! ందుకో .. ఈ రోజు సాంబశివం ప్రవర్తించిన తీరు మనసుకు కష్టం కలిగించింది.

'ఇంతకంటే పస్తులతో చావడమో, ముష్టెత్తుకోవడమో నయం' అనుకుంటూ ఁడుం వాల్చేడు.

లేచేసర్కి నాలుగ్గంటలైంది.

భార్య ఘుమఘుమలాడే వేడి కాఫీ కంచు గ్లాసుతో తెచ్చి అందించింది.

ఒక్కసారి ప్రాణం లేచొచ్చినట్లయింది కాశీపతికి. ఎన్నాళ్ళయిందో యింట్లో కాఫీ ేసుకుని. కాఫీ పొడుం ధర విపరీతంగా పెరిగిపోవడంతో కొనడమే మానుకున్నాడు. అంచేత ఇదెక్కడిదీ? అన్నట్లు భార్య ముఖంలోకి చూశాడు.

"మన నరసింహం తెచ్చేడు" అంటూ లోపలికి వెళ్ళిపోయిందామె.

కాశీపతికంతా విచిత్రంగా అనిపించింది.

నాలుగు రోజులనాడు నరసింహం డిగ్రీలో చేరతానంటే తను తన వల్ల కాదన్నాడు. అక్కడితో ఆపేస్తే ఆ చదువుకి సరైన ఉద్యోగం రాదనీ, అసలు ఉద్యోగమే రాకపోవచ్చనీ తల్లితో చెప్పుకొని ఏడ్చాడు నరసింహం. ఆ రాత్రి ఉక్రోషంతో ఏవేవో మాటలన్నాడు. ఈ ఇంట్లో, ఈ కులంలో పుట్టడం తన ఖర్మ అన్నాడు. అటువంటిది....

కాఫీ తాగేసి పెరట్లోకి వెళ్లేడు కాశీపతి. రోట్లో ఏదో పచ్చడి రుబ్బుతోంది భార్య. నరసింహం యింట్లో ఉన్న జాడ లేదు.

"ఏఁవిటి సంగతీ?" అంటూ భార్య వంక చూశాడు.

"వందన డిగ్రీలో చేరిందట. మనవాడు చేరలేదని తెలిసి రాజుగారు చాలా నొచ్చుకున్నారట. వాళ్ళ ఇద్దరి పిల్లలకూ రోజూ గంటసేపు లెక్కలు చెప్పడానికి మన వాడిని ఒప్పించి మూడొందలు అడ్వాన్స్‌గా యిచ్చారు" అంది.

కాశీపతికి అర్థమైంది. వందన భూపతిరాజుగారి కూతురు. నరసింహంతోనే చదివింది. తనకు రాని లెక్కల్ని నరసింహం చేత చెప్పించుకునేది.

మరో అరగంటలోనే నలుగురైదుగురు పిల్లలొచ్చారు. అందరూ పదో తరగతి చదివే వారే. ఈలోగా నరసింహం కూడా వచ్చి, ముందు గదిలో చాప పరిచి వాళ్ళకి పాఠాలు చెప్పడం మొదలుపెట్టాడు.

కొడుకు ఉద్దేశ్యం అర్థమైంది కాశీపతికి. 'విద్య నిగూఢ గుప్తమగు విత్తమ రూపము పురుషాళికిన్' అని చిన్నప్పుడు చదువుకున్న పద్యం గుర్తుకొచ్చింది. నలుగురికి విద్య నేర్పగల యోగ్యత వున్న వారెవరూ జీవితంలో చెడిపోరు – అనుకున్నాడు.

చొక్కా వేసుకుని అలా పార్కుకి వెళ్లి బెంచీ మీద కూర్చున్నాడు. ఆలోచనలన్నీ గతంలోకి మళ్ళాయి. తను జీవితంలో ఎన్నో పూటలు తిండి లేక పస్తులున్నాడు. పేదరికం అనుభవించేడు. తనను నమ్ముకున్న కుటుంబానికి కూడా తన చేదు అనుభూలన్నే పంచేడు. అప్పట్లో తనూ ఎనిమిదో తరగతి వరకూ చదివేడు కానీ తను చదివిన చదువును పైసలు లెక్కించడానికి తప్ప మరెందుకూ ఉపయోగించలేకపోయాడు.

జీవితం ఎలాగోలా గడిచిపోవడం కాదు, సక్రమంగా, అర్థవంతంగా గడవాలి. అందులోనే మనిషికి ఆనందం లభిస్తుంది, మరి.... జీవితాన్ని అర్థవంతంగా మల్చుకునే శక్తి తనకుందా?

ఆ రాత్రి కాశీపతి బుర్రలో కొత్తగా ఏవేవో ఆలోచనలు!

జీవితంలో యింతవరకూ ఎవరి మీదో ఒకరి మీద ఆధారపడే బతికేడు. తన శరీర కష్టంతోగాని, తెలివితేటలతోగాని పైసా కూడా సంపాదించలేదు. ఒకరికి ఉపయోగపడనూ లేదు. నరసింహం తనలా కాదు. లక్షణంగా చదువుకున్నాడు. ఒకరిపై ఆధారపడకుండా తన జీవనోపాధిని తనే ఎన్నుకోగల ఆలోచనలున్నాయి. ఇక వాడి గురించి చింత లేదు. చింతంతా తన బ్రతుకు గురించే.

పుట్టిన ప్రతి జీవికి మరణం తప్పదు. మరణించిన ప్రతి మానవ జీవి స్వర్గంలోనో నరకంలోనో ఉంటారనీ, వారికి యీ భూలోకంలో శాంతులూ అవీ జరిపి వారి ఆత్మలకు శాంతి కలుగుచేయాలని నమ్మకాలు! అనాదిగా వస్తున్న ఆ నమ్మకాల్ని సొమ్ము చేసుకోవడం జరిగింది.... జరుగుతోంది, జరగబోతోంది కూడా!

ఇన్నాళ్ళూ తన కోసమూ, ఇతరుల కోసమూ నమ్మేడు. కానీ యీ మధ్య తనకే నమ్మకం లేకుండా పోతోంది. తను సుష్టుగా భోజనం చేస్తే ఎప్పుడో పంచభూతాల్లో కల్సిపోయిన జీవి ఎక్కడో వుండి సంతృప్తి పడటమా? ఆలోచిస్తే – యీ నమ్మకాలన్నీ తన లాంటి భుక్తి గడవని వారు ఏర్పరచినవేమోనని అన్పిస్తోంది.

నలుగురి యిళ్ళలోనూ తృప్తిగా తిని వాళ్లిచ్చిన దాన ధర్మాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్న తను బ్రతికుండిగానీ, మరణించిగానీ ఎవరికైనా ఉపయోగపడ గలడా? బ్రతికుండగాలేంది మరణించి ఏం ఉపయోగపడతాడు... పంచభూతాల్లో లీనమైపోవడం తప్ప! తను అట్టే చదువుకోలేదు గనుక తన ఆలోచనలూ, తన మేధ నలుగురికీ ఎలాగూ ఉపయోగపడవు. ఎందరి దానాలతోనో పెరిగిన యీ శరీరం మానవాళికి ఏ మాత్రమైనా ఉపయోగపడదా?

కాశీపతిలో యీ విచికిత్స ప్రారంభమైన రోజు నుంచీ అతనికి రాత్రులు సరైన నిద్ర పట్టేది కాదు. పగటి పూట కూడా పరధ్యానంగానే ఉండేవాడు. నాలుగైదుమార్లు సాంబశివం కబురు పెట్టినా వెళ్ళలేదు.

రాజుగారి సిఫార్సుతో నరసింహానికి ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో టెంపరరీ ఉద్యోగమొచ్చింది. దానికి తోడు సాయంత్రాలు ప్రైవేట్లు ఉండనే ఉన్నాయి.

◆ ❖ ◆

దసరా రోజులు దగ్గరపడ్డాయి. సాంబశివానికి పని వత్తిడి ఎక్కువై మనుషుల అవసరమొచ్చి కబురు మీద కబురు పంపడం మొదలుపెట్టాడు. ఇక తనా వృత్తి చేయలేడనిపించింది కాశీపతికి. ఆ విషయమే సాంబశివానికి కబురంపేడు.

"పోనీ వెళ్లరాదూ, ఇన్నాళ్ళూ చేసిన వృత్తేగా! ఏం కష్టపడిపోవాలి? వేన్నీళ్ళకు చన్నీళ్ళలా నాలుగు డబ్బులొస్తాయి" అంది అన్నపూర్ణ.

ఆమె మాటలు విన్నాడేగాని కాశీపతి ఏం మాట్లాడలేదు.

"పోనీలేవే. చేసినన్నాళ్ళూ చేశాడు. కుల వృత్తే అయినా యీ రోజుల్లో వాటి విలువలూ తగ్గిపోయాయి. ఇంత వయసొచ్చాక ఆ సాంబశివం చుట్టూ తిరిగి ఆయన చేత మాటలెవరు పడమన్నారూ" అన్నాడు నరసింహం.

కొడుకు తనకే సపోర్టివ్వడం కాశీపతికి సంతోషమనిపించింది. అయినా నోరు మెదపలేదు.

పగటిపూట భాగవతమో, రామాయణమో చదవడం; సాయంకాలాలు సాయిబాబా మందిరానికి పురాణ కాలక్షేపం కోసం వెళ్ళడం, అప్పుడప్పుడు ఇంటి వద్ద తనకి నచ్చిన పురాణ కథల్నీ, యితర ప్రాపంచిక విషయాల్నీ అవి కూడా తెలియని వారికి చెప్పడం.. రోజులిలా గడుస్తున్నాయి.

కాశీపతికి ఒక్కొక్కప్పుడు ఆశ్చర్యం కలుగుతుంటుంది. తనిలా రిటైర్మెంట్ జీవితానికి అలవాటు పడ్డాకనే పుస్తక పఠనం అలవాటైంది. అవకాశమున్నంతవరకూ దేశ పరిస్థితుల్నీ ప్రపంచ వార్తల్నీ తెలుసుకుంటున్నాడు. కోవెల్లో ఏర్పడ్డ కాస్తంత పరిచయాన్నీ పెంచుకొని తన వయసే ఉన్న వీధి చివర గవర్నమెంట్ ప్లీడర్ రామచంద్రరావుగారి ద్వారా మరెన్నో విషయాలు గ్రహిస్తున్నాడు. ఒకప్పుడు అన్ని దానాల్లోకీ అన్నదానం గొప్పదనేవారు. ఇప్పుడు నేత్రదానం గొప్పదట! మనిషి చనిపోయిన కొద్ది గంటల్లో నేత్రాలు తీస్తే అవి చూపులేని వారి జీవితంలో ఒక జీవిత కాలం వెలుగును ప్రసాదించగలవట! మనిషి శరీరపు లోపలి భాగాలలో ముఖ్యమైన కిడ్నీలను పవిత్రమైన వైద్యవృత్తి చేస్తున్న డాక్టర్లు ఆపరేషన్ పేరుతో దొంగతనంగా తీసి అమ్ముకుంటున్నారట! అమెరికాలో జీవితావసరాల కోసం వెదుక్కోనవసరం లేదట!

ఇటువంటి ఎన్నో విషయాల్ని యిప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాడు. తెలుసుకున్న కొద్దీ ఆశ్చర్యం! తనిన్నాళ్ళూ జంధ్యాలు వడుక్కుంటూ ఏ సాంబశివం యింటి అరుగు మీదో లేదా రామమందిరం జంక్షన్‌లోనో వృత్తికీ, భుక్తికీ సంబంధించిన విషయాలు మాట్లాడుకుంటూ నూతిలోని కప్ప జీవితం గడిపేశాడు. గడిచిపోయిన జీవితం గురించి బాధపడ్డా. గడపబోయే జీవితం తనకు సంతృప్తినిస్తుందనే ఆలోచన కాశీపతినిప్పుడు ధైర్యంగా ఉంచుతోంది.

తన జీవిత గమనం మారినట్లే ఇంట్లో పరిస్థితులూ చక్కబడుతున్నాయి. కొత్త ౦స్తువులు ఒకటీ అరా ఇంట్లో చోటుచేసుకుంటున్నాయి. అన్నపూర్ణ ముఖంలో సంతోష ౕకలు వెల్లివిరుస్తున్నాయి.

మొదటి నెల జీతం అందగానే నరసింహం తల్లికి- ఆమె ఎన్నాళ్ళుగానో కలలు ౦ంటున్న నెమలి ఫించం రంగు కల్నేత చీర కొన్నాడు. తనకీ ఓ గ్లాస్కో పంచె, తెల్ల ౚాల్చీ కొన్నాడు. కావి రంగు పంచలు, గావంచాల స్థానే మల్లెపువ్వుల్లాంటి ఆ బట్టలు ౕన శరీరానికే కొత్త విలువను తెచ్చిపెట్టినట్టు భావించేడు. ఆ విషయమే అంటే, 'పోన్లేవయ్యా కాశీపతీ. జీవితమంతా ఒకేలా గడపాలని ఎక్కడుంది? అనేవారు ౚామచంద్రంగారు.

◆ ❖ ◆

తిరుపతి, కంచి, కాళహస్తీ వెళ్లే తీర్థయాత్రల బస్సు తమ ఊర్నుంచి ౦యల్దేరుతోందనీ, వీధిలోని చాలామంది వెళ్తున్నారనీ కొడుకుతో చెబితే ఇద్దర్నీ బయల్దేరి ౩ెళ్ళమన్నాడని భార్య ఆ రాత్రి ఆనందంగా చెబుతూంటే ఆశ్చర్యంగా విన్నాడు కాశీపతి.

అన్నపూర్ణకు ఆనందం కాక? పెళ్ళయ్యాక తను తిరుపతి కాదు గదా ఆమె ౚాతగారి ఊరు తిమ్మాపురం కూడా తీసుకెళ్ళలేదు. ఎప్పుడూ ఆర్థిక ఇబ్బందులే!

"నాకే తీర్థయాత్రలూ చెయ్యాలని లేదు. ఆ సర్వాంతర్యామికి నేనూ యిప్పుడిప్పుడే ౩గ్గరవుతున్నాను. ఇది చాలు నాకు" అన్నాడు.

ఏదో చెప్పబోయిన భార్యను వారించి, మరేం చెప్పకు, మనిద్దరం వెళ్తే నరసింహానికి ౘూడా యిబ్బందే. నీ అంత బాగా కాకపోయినా ఏవో నాలుగు గింజలు నేనూ రెండూ ౘూట్లా ఉడకేసి పెట్టగలను" అన్నాడు.

భర్త పట్టు తెలిసిన ఆవిడ మరేం మాట్లాడలేకపోయింది.

◆ ❖ ◆

మరో మూడు రోజుల్లో తీర్థయాత్రల బస్సు తిరిగి వస్తుందనగా బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం వల్ల రాష్ట్రమంతటా తుపాను రేగింది. నదులు పొంగి, చెట్లు ౘూలి, రహదారులు మూసుకుపోయి ఆస్తి, జన నష్టం చాలానే జరిగింది.

"నువ్వు కూడా వెళ్ళాల్సింది నాన్నా. అమ్మకి తోడుండేవాడివి. ఒక్కతే ఏం ఇబ్బంది పడుతోందో" అన్నాడు నరసింహం ఆనాటి న్యూస్ పేపర్ చూస్తూ.

'ఆ భగవంతుడి దగ్గరకు వెళ్లేవారికి వేరే తోడెందుకూ?' అనబోయి ఊరుకున్నాడు కాశీపతి.

మూడో రోజుకు తుపాను శాంతించింది. ఆ రోజు తీర్థయాత్రల బస్సు తిరిగి ౚావాలి.

నరసింహం ఆఫీసు నుండి వచ్చి తల్లి యింకా రాలేదని తెలుసుకుని కాస్సేపు ౘాలుగాలిన పిల్లిలా తిరిగి బయటకెళ్ళిపోయేడు.

కాశీపతి ఆ సాయంకాలం బయటకు వెళ్ళకుండా యింటి పట్టునే ఉండి

పోయాడు. రాత్రి కెలాగూ అన్నపూర్ణ వస్తుందని బంగాళా దుంపల ముక్కలు ఎర్రగా వేయించాడు. అల్లం పచ్చడి చేసి, ఇంగువ చారు పెట్టేడు.

ఆరు... ఏడు... ఎనిమిది... గంటలు గడిచిపోయేయి.

ఆకాశంలో మబ్బులు కమ్ముకుని చలిగాలి వీచడం మొదలుపెట్టింది.

తొమ్మిది గంటలకు నరసింహం వచ్చేడు – అతని ముఖంలో ఆందోళనా, చికాకు.

ఏమైందన్నట్లు ఎదురుగా వెళ్ళేడు కాశీపతి.

"ఎప్పుడూ నీ మొండి పట్టుదలే నీదిగానీ ఒకరి మాట ఎప్పుడు విన్నావు గనుక? ఇప్పుడు చూడు. ఇద్దరం వుండీ అమ్మను ఒక్కదాన్నే పంపించాం" అన్నాడు.

మౌనంగా వీధరుగు మీదకి నడిచేడు కాశీపతి.

అంతవరకు లేని భయమేదో మనసులో చిన్నగా ప్రవేశించి క్రమంగా పెద్దది కాజొచ్చింది. భార్యను తల్చుకుంటే మనసంతా బరువెక్కిపోయింది. పదిహేడేళ్ళ వయస్సులో తనింటి కొచ్చింది అన్నపూర్ణ. తల్లి తండ్రీ చిన్నప్పుడే పోతే మావయ్య దగ్గరుండి పెళ్ళి జరిపించేడు. ఆనాటి నుంచీ కష్టాల కడలి లాంటి తన జీవితంలో తనతో పాటు అవిశ్రాంతంగా యీదుతోంది. ముగ్గురు పిల్లల్ని మోసి, కని గర్భశోకం అనుభవించింది. వయసుడిగే వేళకి అపురూపంగా మిగిలిన నరసింహాన్ని సింహాద్రి అప్పన్న ప్రసాదంగా నమ్మింది.

చినుకులు చిన్నగా మొదలవడంతో లోపలికొచ్చాడు కాశీపతి. మంచం మీద పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు నరసింహం.

"అన్నం చల్లారిపోతుంది తినరాదూ" అన్నాడు గుమ్మం వద్ద నిలబడి.

"నా కాకలిగా లేదు. నువ్వు తినేయ్" అన్నాడు నరసింహం.

నరసింహం తనకంటే ఎక్కువ ఆందోళన పడుతున్నట్టు అర్థమైంది కాశీపతికి. వంటింటి తలుపు దగ్గరగా వేసి తన గదిలోకి వెళ్ళి మంచం మీద మేను వాల్చాడు. ఏవేవో ఆలోచనలు ఎప్పటివో కందిరీగల్లా ముసురుకో నారంభించాయి. నరసింహం పుట్టినప్పుడు అన్నపూర్ణ అయిదు రోజులు ప్రభుత్వాసుపత్రిలో నిస్సహాయంగా ఉండిపోవడం... మరో మారెప్పుడో మలేరియా వచ్చి ఆమె మంచాన పడితే బలమైన ఆహారం కూడా యివ్వలేని స్థితిలో తనుండడమే కాకుండా భోక్తగా ఎవరింటికో వెళ్ళి సుష్టుగా భోంచేసి రావడం...యిలా అన్నీ తన నిస్సహాయ ఆర్థిక స్థితిని గుర్తు చేసే జ్ఞాపకాలే!

ఎప్పుడు నిద్రలోకి ఒరిగిపోయాడో ఒక రాత్రివేళ వళ్ళంతా చెమటలు పట్టేసి నాలిక పిడచగట్టుకుపోతున్న సయమంలో మెలకువ వచ్చింది. నెమ్మదిగా లేచి గ్లాసుడు మంచినీళ్ళు తాగేడు. కడుపులో ఏదో అలజడి... ఛాతీలో ఏదో బరువుగా మొదలైన నొప్పి...

నరసింహం గాఢనిద్ర పోతున్నాడు. బయట ధారలు ధారలుగా వర్షం!

'అన్నపూర్ణకేం కాకూడదు భగవంతుడా' - మనసులోనే మొక్కుకున్నాడు.

'భగవంతుడి దగ్గరకు వెళ్ళేవారికి వేరే తోడెందుకూ?' అని నరసింహంతో అనబోయీ అనని మాటలు మరోలా ధ్వనించాయి.

మనసులో ఎక్కడో ఏదో కీడు సంశయాత్మకంగా. దిండుపైకి జరుపుకొని జారబడి దుప్పటిని గుండెల వరకూ కప్పుకున్నాడు.

◆ ◆ ◆

ఉదయం ఏడు గంటల వేళ.... వార్త ఒకరికీ ఒకరికీ తెలిసి కాశీపతి ఇంటి ముందు జనం గుమిగూడుతున్నారు.

వీధరుగు మీద నరసింహం తలొంచుకుని మౌనంగా కూర్చున్నాడు. అతనికి కాస్త దూరంలో సాంబశివం, మరో నలుగురూ.

సరిగ్గా అదే సమయంలో ఇంటి ముందు రిక్షా దిగింది అన్నపూర్ణ. తండ్రి పాదాల దగ్గర కూర్చున్న నరసింహం లేచి ఒకడుగు ముందుకేసి తల్లి ముఖంలోకి చూశాడు. ఆమెకాచూపు సగం అర్థమైంది. మిగతా సగం అరుగు మీద నిశ్చలంగా పడుకుని వున్న కాశీపతి శరీరాన్ని చూస్తే అర్థమైంది.

ఆమె కాళ్ళు తడబడ్డాయి..... గొంతు వణికింది. చూపు బిత్తరపోయింది.

అంతవరకూ ఉగ్గబెట్టుకున్న నరసింహం యిక ఉండలేక పోయాడు.

అన్నపూర్ణ గొంతు పగిలేలా కేక పెట్టి భర్త పాదాల దగ్గర కూలిపోయింది.

"ఆ సర్వాంతర్యామికి యిప్పుడిప్పుడే దగ్గరౌతున్నానంటే ఏమిటో అనుకున్నానండీ నన్నలా పంపి మీరిలా ఆ పరమాత్ముడి దగ్గరకు వెళ్ళిపోయారా" అంటూ తల్లుకు తల్లుకు ఆమె చేసిన రోదన అక్కడ వున్న అందర్నీ కదలించి వేసింది.

అరగంట తర్వాత ఆమె అలిసిపోయి అలా గోడకి జారబడిపోయింది. నరసింహం గ్లాసుతో కాఫీ తెచ్చి ఆమె చేత బలవంతంగా తాగించేడు.

"బతికినన్నాళ్ళు గుట్టుగానే బతికేడు బ్రాహ్మడు. చివరి రోజుల్లో ఏం సుఖపడ్డాడో... అంతే"

"సునాయాస మరణం. తెల్లావారురుఝామున నిద్రలోనే గుండె ఆగిపోయిందట.. జిర్రున చీది ఎరుగడు... మంచాన పడ్డం లేదు. అదృష్టవంతుడు."

"కొడుకు ప్రయోజకుడయ్యేడు. ఆయమ్మకి లోటుండదు".

నలుగురూ అనుకుంటున్న మాటలు అన్నపూర్ణ చెవిన పడుతున్నాయి.

"నరసింహం! అమ్మగారు కూడా వచ్చేశారు కాబట్టి యిక జరగాల్సిన కార్యక్రమం గురించి ఆలోచిస్తే మంచిది. రాత్రంతా కురిసిన వర్షం తెరిపిచ్చింది. మళ్ళీ ఎప్పుడు మూస్తుందో" అంటూ సాంబశివం లేచి నిల్చున్నాడు.

నరసింహం బేలకళ్ళతో అతని వంక చూశాడు.

సరిగ్గా అదే సమయంలో గవర్నమెంట్ వారి అంబులెన్స్ ఒకటి యింటి ముందు ఆగింది. అందరూ ఆశ్చర్యంగా అటువైపు చూసేలోగా ముందు సీట్లోంచి ప్లీడర్

రామచంద్రంగారూ, ఆసుపత్రికి చెందిన ఇద్దరు డాక్టర్లూ క్రిందికి దిగారు.

ఏం జరగబోతున్నదీ అక్కడున్న ఎవరికీ అర్థం కాలేదు. రామచంద్రంగారే నెమ్మదిగా నరసింహాన్ని దగ్గరకు పిలిచి విషయం చెప్పేరు. ఆ తర్వాత అన్నపూర్ణతోనూ వివరంగా చెప్పేరు.

అన్నపూర్ణ, నరసింహం ఏడ్వడం మర్చిపోయి కొయ్యబొమ్మలై పోయారు.

కాశీపతి, యిలా చేస్తాడనిగానీ, తమ కుటుంబాల్లో కనివినీ ఎరుగని యిటువంటి పరిస్థితి ఏర్పడుతుందనిగానీ వారు కలలో కూడా ఊహించలేదు. అటువంటి ఆలోచన కాశీపతిలో కలగడానికి గల కారణాలూ వారికి అవగతం కాలేదు.

రామచంద్రంగారు కూర్చుని చెప్పడం మొదలుపెట్టేరు.

“నిజానికి మొదట ఆయన అన్నప్పుడు నాకూ ఆశ్చర్యమే అనిపించింది. అతని దాన గుణం గొప్పదే అనిపించింది. ఎప్పటికప్పుడు విషయాన్ని దాటవేస్తూ వచ్చినా పట్టు విడవకుండా తను అనుకున్నది జరిపించే వరకూ ఊరుకోలేదు కాశీపతి. జీవితంలో తనెవరికీ ఉపయోగపడలేక పోయాననే చింతే చివరి రోజులలో ఆయనలో కనిపించింది. బహుశః యీ పని నా చేత జరిపించడానికే నాకు దగ్గరయ్యాడా అనిపిస్తోంది. కొన్నాళ్ళు నేత్రాలు దానం చేస్తానన్నాడు. మరి కొన్నాళ్ళు కిడ్నీ యిచ్చేస్తానన్నాడు. నాలుగు రోజుల క్రితం మరణానంతరం తన శరీరాన్ని వైద్య కళాశాల కిచ్చేట్టు రాయించమని కాగితాలు తెచ్చేడు. ఏమైనా అతని ఆశయం గొప్పది. చచ్చేక పిడికెడు బూడిదగా అయ్యేకంటే ఆ శరీరం ఎవరికైనా ఉపయోగపడితే చాలన్నాడు. మరణానంతరం జరిపే తంతులో నమ్మకాలు సన్నగిల్లాయన్నాడు.

“వేదికలెక్కి నేత్ర దానాలు చేయాలని ప్రసంగించే ప్రముఖులు కూడా ఆ పని చేయగలరో లేదో గానీ కాశీపతి మాత్రం ఏ ఆర్భాటమూ లేకుండానే తన శరీరాన్ని వైద్య ప్రయోగశాలకు దానమివ్వాలనుకునప్పుడు నేను కాదనలేకపోయాను. కానీ యింత త్వరలోనే అతని కోర్కెనిలా తీర్చవలసి వస్తుందనుకోలేదు. అయితే ఇటువంటి దానం చేస్తున్నప్పుడు అతనితోపాటు అతని కుటుంబ సభ్యుల సమ్మతి కూడా అవసరం. అందు కోసమే యీ ఉత్తరం మీ పేరన నాకు రాసి యిచ్చేడు” అంటూ ఓ కవరు అందించేరు.

మాట పెగలని మౌనంతో కవరు విప్పేడు నరసింహం.

“జీవితంలో ఎందరి నుంచో ఎన్నో దానాలను అందుకున్న నేను నా మనసుకు నచ్చిన యీ దానాన్ని చేస్తున్నాను. ఇది నా శక్తికి మించినది కాదు. నా ఆత్మ తృప్తి కోసం కాదనకండి” అని ఉందా ఉత్తరంలో –

మరి కాస్సేపట్లోనే కాశీపతి భౌతిక దేహాన్ని ప్రభుత్వ అంబులెన్స్‌లోకి ఎక్కించేరు.

*'రచన' జన్మదిన ప్రత్యేక సంచిక – ఫిబ్రవరి 1998.*

*'ఆత్మతృప్తి' శీర్షికతో 'కథాపీఠం'కు ఎన్నికైన కథ*